

సాక్షి
బాపట్ల
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



వీరాంజనేయ స్వామికి పూజలు

నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులోని శ్రీ వీరాంజనేయ ఆలయంలో ఆదివారం పుర్వభద్ర జన్మనక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు చేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,04,301 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 90,774 క్యూసెక్కులు వదులుతున్నారు.

కార్మెల్ కొండపై భక్తుల ప్రార్థనలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాత దర్శనానికి భక్తులు ఆదివారం భారీగా వచ్చారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

న్యూస్‌రీల్

శింగరకొండపై హైకోర్టు జడ్జి పూజలు



అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ పైనున్న లక్ష్మి నరసింహ స్వామిని హైకోర్టు జడ్జి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆయ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల చేసిన అనంతరం తీర్ధ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట అద్దంకి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నాగలక్ష్మి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల అఖిల ప్రియ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీత ఉన్నారు.

శివాజీ పల్లకి సేవకు స్వాగతం



మాదల(ముప్పాళ్ళ): ఆంధ్రప్రదేశ్ మరాఠా రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఛత్రపతి శివాజీ మహారాజ్ పల్లకి సేవ వాహన యాత్రకు మండలంలోని మాదల గ్రామం వద్ద సంఘ సభ్యులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. మరాఠా సంఘం అధ్యక్షులు వెంకట సోమాజీ ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర విజయవాడ శ్రీకనకదుర్గమ్మ ఆలయం నుంచి శ్రీశైలం శ్రీమల్లికార్జునస్వామి ఆలయం వరకు సాగనుంది. యాత్ర వాహనాలకు మాదల వద్ద సంఘ సభ్యులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ముప్పాళ్ళ మీదుగా నరసరావుపేటకు యాత్ర వెళ్లింది. సంఘ సభ్యులు పులహరి పిరోజీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డు పులుపులవారి వీధిలోని శ్రీవీరాంజనేయ స్వామి సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి రాతి ఆలయ నిర్మాణానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలను కమిటీ సభ్యులకు అందించారు. పట్టణానికి చెందిన మెడికల్ వ్యాపారి అర్వపల్లి రామకోటి సుబ్బారావు, నాగేశ్వరి దంపతులు ముఖమండపం 12వ రాతి స్తంభం నిర్మాణానికి రూ.3,01,116 అందించారు. అలాగే వర్రా సావిత్రమ్మ రూ.51,116, అర్వపల్లి సాంబశివరావు, వెంకట విజయలక్ష్మి దంపతులు రూ.25,116 ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులుపుల రాము, వనమా సాంబశివరావు, కోవూరు శివశ్రీనుబాబు, వనమా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీపీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

గుంటూరు రూరల్: పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష కేంద్రంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం పరిశీలించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలకలూరు రోడ్డులోగల విజ్ఞాన్ నిరులా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పరీక్షలను జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్), నోడల్ అధికారి రమణమూర్తితో కలిసి ఎస్పీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్ఐ వాసు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు



బయ్యవరం(క్రోసూరు): మండల పరిధిలోని బయ్యవరం గ్రామంలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆరు పళ్ల విభాగంలో విజేతలుగా ఎనిమిది జతలు నిలిచాయి. ఆదివారం నాలుగు పళ్ల విభాగంలో ఎనిమిది జతలు గెలిచాయి. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చుట్టపక్కల గ్రామాల రైతులు ఎడ్ల పోటీలు తిలకించేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు.

కూటమి మోసాలపై పోరుబాట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలోని దాదాపు 25 వేల మందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికలకు ముందు పీఆర్సీ, మంచి ఐఆర్ ఇస్తామని, పెండింగ్ బకాయిలన్నీ విడుదల చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నర గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వినతి పత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన లేదు. దీంతో వారు పోరుబాట పట్టారు.

ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర ఆగ్రహం

- ఎన్నికల వేళ ఓట్ల కోసం అడ్డగోలుగా హామీలిచ్చిన కూటమి నేతలు
- 4 డీఏల బకాయిల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, టీచర్లు
- ఏడాదిన్నర దాటినా పీఆర్సీ ఊసు కూడా ఎత్తకపోవడంపై మండిపాటు
- ఇప్పటికే రోడ్డెక్కిన ఉపాధ్యాయ సంఘాలు
- రేపు విజయవాడలో ఫ్యాప్టో 'పోరుబాట'



పోరుబాట ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎలాంటి కష్టం లేకుండా సకాలంలో చెల్లింపులు చేశారు. అంతకుముందు ప్రభుత్వం బకాయి పెట్టిన 3 డీఏలూ చెల్లించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు డీఏలు బకాయి పెట్టింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు కూడా మంజూరు చేయడం లేదని ఉద్యోగులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. బిడ్డల చదువులకు, వివాహాల నిమిత్తం దాచుకున్న దాని నుంచి రుణాలు కావాలని దరఖాస్తులు పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దసరా కానుకగా కనీసం రెండు డీఏల బకాయిలైనా విడుదల చేస్తారని ఎదురుచూసినా నిరాశే మిగిలింది.

జిల్లాలో 25 వేల మందికి వెన్నుపోటు

రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసానికి జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు బలయ్యారు. వీరిలో 7,415 మంది ఉపాధ్యాయులు ఉండగా.. మిగతావారు ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు ఉన్నారు. వీరికి ఒక్క డీఏ బకాయి వరకు చూసుకున్నా సుమారు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లపైనే బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాల బకాయిలు మరో రూ.160 కోట్లు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల మంది పెన్షనర్లు కరువు భత్యం కోసం ఎదురుచూస్తున్నారు.

పీఆర్సీ ఊసే ఎత్తడం లేదు..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ ప్రకటిస్తే తమ జీతాలు పెరుగుతాయని ఆశగా ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల ప్రకటన విడుదల కావడం లేదు. 12వ పీఆర్సీ ప్రకటిస్తే కనీసం 30 శాతం ఫిట్‌మెంట్ లభించి, సుమారు రూ.50 వేల జీతం తీసుకునే ఉద్యోగికి మరో రూ.15 వేల వరకు అదనంగా వచ్చే అవకాశం ఉందని, సర్కారు కప్పదాటుగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీఆర్సీ చైర్మన్‌ను నియమించగా, అధ్యయనం చేస్తుండగానే ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో కష్టాలు మొదటికొచ్చాయని వాపోతున్నారు.

సర్కారు తీరుపై సంఘాల ఆగ్రహం

బకాయిలను వెంటనే విడుదల చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు విడివిడిగా కలెక్టర్ కార్యాలయాలు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించాయి. ఫ్యాప్టో ఆధ్వర్యంలో కొన్ని ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలకు దిగాయి. ఐక్యవేదికగా ఏర్పడి పోరుబాట పట్టాయి. ప్రభుత్వంలో కదలిక రాలేదు. ఏపీటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన వారం చేపట్టగా .. యుటీఎఫ్ రణభేరి కార్యక్రమం నిర్వహించింది. ఈ నెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరుబాట పేరుతో విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చారు. ఎన్జీవో నాయకులు సైతం వచ్చే రెండు నెలల్లో అన్ని సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ ప్రారంభిస్తామని హెచ్చరించారు.

హామీలన్నీ నెరవేర్చాలి



2023 జూలై ఒకటో తేదీ నుంచి కొత్త పీఆర్సీ అమలు చేయాల్సి ఉంది. చైర్మన్‌ను నియమించాక కొత్త ప్రభుత్వం వచ్చి 16 నెలలు దాటుతున్నా ఆ మాటే ఎత్తకపోవడం దురదృష్టకరం. పాత పీఆర్సీ బకాయిలు ఇచ్చిన తరువాతే కొత్త కమిషన్‌ను వేస్తామని చెబుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అడిగితే ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నారని మాట దాటవేస్తున్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలి. కనీసం ఒక్క డీఏను కుడా ఇవ్వలేదు. పాత పీఆర్సీ బకాయిలు కూడా ఇవ్వడం లేదు. విజయవాడలో రేపు జరిగే ధర్నాలో పీఆర్సీయే ప్రధానంగా పోరాడతాం.
– ఎస్ఎం సుభాని, ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు

అక్రమార్జనలో ఆరితేరిన తమ్ముళ్లు ఇప్పుడు కొట్లాటలకు సైతం వెనుకాడం లేదు. పదవుల నుంచి ఇసుక దందా, మట్టి తరలింపు, మద్యం మాఫియా, బియ్యం అక్రమరవాణా... ఇలా పలు అంశాల్లో తాము చెప్పినట్లే జరగాలని ఎవరికి వారు ప్రయత్నిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక మండల, గ్రామ స్థాయి పచ్చనేతల తీరు ఇలా ఉండటంతో వర్గ విభేదాలు పెరిగాయి. ఆధిపత్యం చాటేందుకు తన్నుకోవడానికైనా సై అంటున్నారు.

'పచ్చ' పార్టీలో రచ్చ రచ్చ

- వర్గాలుగా విడిపోయిన తమ్ముళ్లు
- అక్రమాల కోసం ఎమ్మెల్యే ప్రోత్సాహం
- వేమూరులో పరస్పరం దాడులు
- పోలీసు సహా పలువురికి గాయాలు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: వేమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. పరస్పర దాడులకు తెగబడుతున్నారు. మాజీ మంత్రి , ప్రస్తుత ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు స్వయంగా నియోజకవర్గంలో వర్గాలను ప్రోత్సహిస్తున్నారని పచ్చపార్టీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. శుక్రవారం కొల్లూరు మండల నేతలు డాక్టర్ కనగాల మధుసూదన్, మైనేని మురళి వర్గాలు రోడ్డున పడి తన్నుకున్నాయి. నక్కా సమక్షంలోనే డాక్టర్‌పై మురళి వర్గీయులు దాడికి తెగబడ్డారు. ప్రతిగా డాక్టర్ వర్గీయులు వారిని కొట్టారు. ఇరువర్గాలకు చెందిన ఐదుగురికి గాయాలు కాగా, అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌కు సైతం గాయాలు తప్పలేదు. ఇంత జరిగినా కేసులు లేవు.

అంతటా అదే తంతు..

- వేమూరులో విభేదాలు పతాకస్థాయికి చేరాయి. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జొన్నలగడ్డ విజయ్‌బాబు, చావలికి చెందిన మండల పార్టీ మాజీ అధ్యక్షుడు దండె సుబ్బారావుల మధ్య గొడవలు ఉన్నాయి. విజయ్‌బాబు వ్యతిరేకత వ్యక్తం చేయడంతోనే దండె సుబ్బారావును మండల టీడీపీ అధ్యక్ష పదవి నుంచి ఎమ్మెల్యే తొలగించారు.
- అమృతలూరులో మార్కెట్ యార్డు చైర్మన్ పూర్ణకుమారి భర్త గొట్టిపాటి గంగాధర్, మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్‌ల మధ్య విబేధాలు తారస్థాయికి చేరాయి. గంగాధర్‌కు ఎమ్మెల్యే మద్దతు పలుకుతుండడంతో రత్నప్రసాద్ వర్గం మండిపడుతోంది.
- భట్టిప్రోలు మండలంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూముగుంట్ల సాయిబాబా, పార్టీ నేత భట్టు మల్లికార్జునరావుల మధ్య విబేధాలు ఉన్నాయి. ఎమ్మెల్యే మద్దతు భట్టు మల్లికార్జునరావుకు ఉందని ప్రచారం జరుగుతోంది. సాయిబాబా వర్గీయులు ఎమ్మెల్యేకు సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మండల, గ్రామ స్థాయిలోనూ కేడర్ రెండు వర్గాలుగా విడిపోయింది.
- చుండూరు మండల టీడీపీ అధ్యక్షుడి ఎన్నిక ఆ పార్టీలో వర్గాలను మరింతగా రాజేసింది. చుండూరుకు చెందిన యల్లారెడ్డి, వలివేరుకు చెందిన తమ్మా శివారెడ్డిలు మండల పార్టీ అధ్యక్ష పదవిని ఆశించారు. శివారెడ్డికి ఎమ్మెల్యే మద్దతు ఇచ్చి పదవి కట్టబెట్టడంతో యల్లారెడ్డి వర్గం ఆగ్రహంతో ఉంది.

అక్రమాలకు వారే కీలకం

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రోత్సహిస్తున్న వర్గీయులకు పదవులు దక్కుతున్నాయి. దీంతో పాటు నియోజకవర్గంలో ఇసుక, మట్టి, బియ్యం దందాను నడిపిస్తున్నారు. కొల్లూరులో ఎమ్మెల్యే మద్దతు పలుకుతున్న మైనేని మురళి వర్గం ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాల్లో ఎమ్మెల్యే మద్దతు ఇస్తున్న వర్గాలు కూడా బియ్యం, లిక్కర్, బెల్టు షాపుల దందా చేస్తున్నాయి.

కె. రాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి అవార్డు



కె. రాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రం భవనం



చిన్నారులతో నిర్మలాదేవి

జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డు అందుకోనున్న కార్యకర్త

బల్లికురవ: జిల్లా స్థాయిలో స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రంగా మండలంలోని కె. రాజుపాలెం గ్రామ కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీఓ దీవి సుధ ఆదివారం తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం బాపట్లలో అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకురాలైన కార్యకర్త పి. నిర్మలాదేవి అవార్డు అందుకోనున్నట్లు చెప్పారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన బృందం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిందని గుర్తుచేశారు. జిల్లాలోని 5 స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కె. రాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త పి. నిర్మలాదేవి, సహాయకురాలు భాగ్యలక్ష్మి రెండున్నర దశాబ్దాలుగా అందిస్తున్న సేవలకు అవార్డుతో గుర్తింపు లభించినట్లు సీడీపీఓ వివరించారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు బాపట్ల ఎంఆర్‌ఎఫ్ కల్యాణ మండపంలో అవార్డు ప్రదానోత్సవం ఉంటుందని చెప్పారు.

నేడు స్వచ్ఛ పురస్కారాల ప్రదానం



బాపట్ల: స్వచ్ఛ పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కమ్మ కల్యాణ మండపంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందిస్తామని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను అక్టోబర్ 2న ప్రభుత్వం ప్రకటించినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఒక అవార్డు వచ్చిందన్నారు. జిల్లా స్థాయిలో పలు విభాగాలలో 49 అవార్డులు వచ్చినట్లు వివరించారు. జిల్లా స్థాయి కార్యక్రమం సోమవారం సాయంత్రం 4 గంటలకు ఉంటుందని తెలిపారు.

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఎంపిక



జేసీ గంగాధర్ గౌడ్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఆల్ఫ్రెడ్ రాజా సాల్మన్



దాసరి ఇమ్మానుయేలు



కొమరగిరి వెంకట ప్రసాద్

చీరాల రూరల్/వేటపాలెం: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (పౌరహక్కుల పరిరక్షణ చట్టం, ఎస్సీ ఎస్టీ అత్యాచార నివారణ చట్టం) సభ్యులుగా చీరాలకు చెందిన మేలుకొలుపు వినియోగదారుల రక్షణ సంస్థ కార్యదర్శి దాసరి ఇమ్మానుయేలు, హెచ్ఐవీ బాధితుల క్షేమం కోసం షాడో సంస్థ ద్వారా సేవలందిస్తున్న న్యాయవాది ఆల్ఫ్రెడ్ రాజా సాల్మన్ ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ వి. వినోద్‌కుమార్ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మొదటి సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్ నుంచి నియామక పత్రాలు అందుకున్నట్లు వారు తెలిపారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీ మూడు నెలలకు ఒకసారి సమావేశమై దళిత, గిరిజనుల అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి, పౌరహక్కుల రక్షణపైనా చర్చిస్తుందని చెప్పారు. రావూరిపేటకు చెందిన కొమరగిరి వెంకట ప్రసాద్‌ను కూడా సభ్యునిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కొమరగిరి వెంకట ప్రసాద్‌ను ఆదివారం యానాది యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏందేటి వెంకట సుబ్బయ్య, జిల్లా కమిటీ అధ్యక్షులు చౌటూరి రమేష్, ప్రధాన కార్యదర్శి గంధళ్ల నరేష్ తదితరులు అభినందించారు.

హిందీ భాషకు పెరుగుతున్న ప్రాధాన్యం

- విశ్రాంత రిజిస్ట్రార్, రచయిత రావెల సాంబశివరావు
- హిందీ భాషా ప్రచార సేవకులకు పురస్కారాల ప్రదానం



షేక్ కాశింబీ, ప్రొఫెసర్ నారాయణకు గురుపీఠ పురస్కారాల ప్రదానం

తెనాలి: ఉపాధి అవకాశాలకు విదేశీ తలుపులు మూసుకుపోతున్న నేటి కాలంలో స్వదేశంలోనే ఉద్యోగాలను వెతుక్కోవాల్సి వస్తుందనీ, అప్పుడు హిందీ భాష నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్, ప్రముఖ రచయిత రావెల సాంబశివరావు అభిప్రాయపడ్డారు. స్థానిక హిందీ ప్రేమి మండలి మహా విద్యాలయంలో ఏటా జరిగే గాంధీ జయంతి, బోయపాటి నాగేశ్వరరావు–సుభద్రాదేవి గురు దంపతుల 23వ వార్షిక గురుపీఠ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహా విద్యాలయం ప్రాంగణంలోని మోటూరి సత్యనారాయణ స్మారక సభా వేదికపై జరిగిన సభకు రావెల సాంబశివరావు అధ్యక్షత వహించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగం ఆచార్యులు, రచయిత ప్రొఫెసర్ నారాయణ, కాకినాడకు చెందిన విశ్రాంత హిందీ అధ్యాపకురాలు, రచయిత్రి షేక్ కాశింబీకి గురుపీఠ పురస్కారాలు, నగదును ప్రదానం చేసి సత్కరించారు. సభాధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ స్వదేశంలోనే ఉద్యోగాలకు మాతృభాష తెలుగుతో పాటు హిందీని నేర్చుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని సూచించారు. విజయవాడకు చెందిన బహు గ్రంథకర్త డాక్టర్ వెన్నా వల్లభరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ అడుగిడిన ప్రేమి మండలి పునీతమైందని తెలిపారు. సత్కారగ్రహీతలైన ప్రొఫెసర్ నారాయణ షేక్ కాశింబీ మాట్లాడుతూ మాతృభాష తెలుగుతో పాటు హిందీని నేర్చుకోవడం మంచిదని సూచించారు. డాక్టర్ మురుకుట్ల మంజుల స్వాగతం పలుకగా, నాగళ్ల దుర్గా రఘురాం వందన సమర్పణ చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాసరావు, కస్తూరి పర్యవేక్షించారు.

తీరంలో ఇద్దరు గల్లంతు

– కాపాడిన రక్షణ సిబ్బంది



బాపట్ల టౌన్: సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తూ ఇద్దరు యువకులు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా టేకుమిట్ల గ్రామానికి చెందిన బొడ్డు శ్రీను, నల్గొండ జిల్లాకు చెందిన కత్తుల వినేష్‌లు తమ కుటుంబ సభ్యులతో ఆదివారం మధ్యాహ్నం సూర్యలంక తీరానికి చేరుకున్నారు. సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ఇరువురు నీటిలో మునిగారు. గమనించిన కుటుంబసభ్యులు కేకలు వేయడంతో అప్రమత్తమైన కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది, గజ ఈతగాళ్లు సముద్రంలోకి వెళ్లారు. కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులను సురక్షితంగా కాపాడి ఒడ్డుకు చేర్చారు. కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది, గజ ఈతగాళ్లను ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు. తీరానికి వచ్చే పర్యాటకులు పోలీస్ సిబ్బంది ఆదేశాలను పాటించి, సముద్రస్నానాలు చేయాలని ఆయన సూచించారు.

వైభవంగా శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం

తెనాలి అర్బన్: ఐతానగర్‌లోని శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, శ్రీకృష్ణ భక్త బృందం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి, మల్లేశ్వర స్వామి దేవాలయాలకు చెందిన 1.20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నక్షత్రవనం, రాశివనం, పంచవటి, నవగ్రహవనాలలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దేవదాయ శాఖ, శ్రీసత్యసాయి సేవా సమితి పల్నాడు జిల్లా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ దంపతులను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు



కార్యక్రమం ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్. వేదికపై జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ శ్రీనివాస్ ఊటుకూరు, జస్టిస్ వి.సుజాత, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ కృతికాశుక్లా తదితరులు – చిలకలూరిపేట

క్లుప్తంగా

శివాలయంలో అన్నదానానికి విరాళం



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి గ్రామానికి చెందిన కానుగంటి రాధాకృష్ణమూర్తి, సామ్రాజ్యం దంపతుల పేరున వారి కుమారుడు హరిబాబు, నాగేశ్వరి దంపతులు ఆదివారం రూ. 1,00,116ను విరాళంగా అందజేశారు. ప్రతి సంవత్సరం మహాలయ అమావాస్య రోజున అన్నప్రసాద వితరణ చేయాలని దాతలు కోరారు. ఆలయ సిబ్బంది దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని బహూకరించారు.

8న సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8వ తేదీన జరుగుతాయని అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వడ్డెంపూడి పవన్ కుమార్, పి.శివరామకృష్ణలు ఆదివారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికయిన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో ప్రకాశం జిల్లా చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 8712129398, 99851 86556 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడిగా డాక్టర్ సేవ కుమార్

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ తాతా సేవకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని జీఎంఏ హాల్లో నిర్వహించిన 2025-2026 కార్యవర్గం ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.శివప్రసాద్, కార్యదర్శిగా డాక్టర్ బి.సాయికృష్ణ, సంయుక్త కార్యదర్శిగా చిలకా శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మరో 25మంది ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ తాతా సేవకుమార్ 2004లో ఐఎంఏ గుంటూరు శాఖలో సభ్యత్వం పొందారు. శాఖలో అంచలంచెలుగా పలు పదవులు నిర్వహించి ఇప్పుడు అధ్యక్ష పదవి అందుకున్నారు. ఐఎంఏ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉన్న డాక్టర్ సేవకుమార్ గతంలోరాష్ట్ర వర్కింగ్ కమిటీలో, ఐఎంఏ వివిధ స్కీంలలో పని చేశారు. ప్రస్తుతం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాల నుంచి ఎంబీబీఎస్ పట్టా పొందిన డాక్టర్ సేవ కుమార్ 1996లో బ్రాడీపేటలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ)ను స్థాపించారు. నాటి నుంచి ఉచిత వైద్య సలహాలు, అతి తక్కువ ఖర్చుకి అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అందిస్తున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ సేవ కుమార్‌ను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కిశోర్, ఐఎంఏ సీజీపీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఎం.ఫణికుమార్, ఎన్నికల నిర్వహణ అధికారి డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావు, డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, డాక్టర్ డి. అమరలింగేశ్వరరావు అభినందించారు.

చలో విజయవాడకు తరలిరండి

- యూటీఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మోహనరావు
- కరపత్రం ఆవిష్కరించిన నాయకులు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం మంగళవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కార్యాలయంలో ఛలో విజయవాడ పోరుబాట కార్యక్రమ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించారన్నారు. బకాయి ఉన్న నాలుగు డీఏలను విడుదల చేసి ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించి, బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం నుంచి విముక్తి కల్పించాలని, సరెండర్ లీవ్, పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ప్రభుత్వానికి పలు మార్లు యూనియన్ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చలో విజయవాడ పోరుబాట కార్యక్రమం చేపట్టామన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు బి.ప్రజామూర్తి, నాయకులు టి.వెంకటేశ్వర్లు, డీఎస్ఎస్ మూర్తి, కె.రవి, సీహెచ్.నాగేశ్వరరావు, ఎం.రామాంజనేయులు, టి. నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు

- నవంబర్ 8,9 తేదీల్లో నరసరావుపేటలో నిర్వహణ
- వెల్లడించిన పల్నాడు జిల్లా బాలోత్సవ కమిటీ సభ్యులు



పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆవరణలో నవంబరు 8,9 తేదీల్లో ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు, ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు పేర్కొన్నారు. కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందని, అదేస్ఫూర్తితో ఈ ఏడాది పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీలు నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. గౌరవ సలహాదారుడు, శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. పోటీల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.అంజిరెడ్డి, గౌస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనేలా రూపకల్పన చేసి తమ కళలను ఆవిష్కరింప చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పోటీలో పాల్గొనదలచిన ఉపాధ్యాయులు ఈనెల 26వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98665 62260, 99498 09821 నెంబర్లలో palnadubaoltsavam@gmail.com మెయిల్ ఐడీలో సంప్రదించాలని సూచించారు.

విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి



నిరసన వ్యక్తం చేస్తున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు

లక్ష్మీపురం: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు అంటించిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం, పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మరో విగ్రహాన్ని ప్రతిష్ఠించింది గానీ, ఘటన జరిగి మూడు రోజులైనా దోషులను అరెస్టు చేయకుండా ఏమి చేస్తుందని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు నిత్య కృత్యమయ్యాయని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం పిఠాపురంలో దళితులపై దాడులు చేస్తే నిందితులపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ ఘటనలు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దళితుల పట్ల చిన్నచూపును తెలియజేస్తుందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నగర అధ్యక్షులు జి.లూథర్ పాల్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగం మీద నిరంతరం దాడి జరుగుతోందని విమర్శించారు. దళితులను చదువుకు, మానవీయ విలువలకు దూరంగా ఉంచిన మనువాద సిద్ధాంతాన్ని తీసుకు రావడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ చర్యలను ప్రజాస్వామికవాదులు అందరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బి.ముత్యాలరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్, కేవీపీఎస్ నాయకులు యం.సుందరబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జాన్ బాబు, నాయకులు జి. వెంకట్రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

సంఘ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్రాంత అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని రాష్ట్ర జూనియర్ కళాశాలల విశ్రాంత అధ్యాపక సంఘ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సంఘ రాష్ట్రస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తే, సహచర పెన్షనర్ సంఘాలతో కలిసి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజు తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేయడం బాధాకరమని తెలిపారు. 70 నుంచి 75 ఏళ్ల పూర్తి చేసుకున్న పెన్షనర్లకు తగ్గించిన అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలను చెల్లింపుతో పాటు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ వ్యవస్థ నుంచి వచ్చిన పెన్షనర్లకు మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లందరికీ అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరారు.

ఆదాయపు పన్నును రద్దు పర్చి, గతంలో ఉన్న రైలు ప్రయాణ టికెట్ రాయితీని పునరుద్ధరించాలని విన్నవించారు. మానిటరీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభకు అధ్యక్షత వహించిన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ప్రభుత్వ, ఎయిడెడ్ ఇంటర్మీడియట్ అధ్యాపకుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి.భాస్కరరావు, జెడ్.ఎస్. రామచంద్రరావు, జి.సుబ్బారావు, 13 జిల్లాల కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఈనెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పిలుపునిచ్చారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జరిగిన సంఘ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినప్పటికీ హామీల అమలుకు చర్యలు తీసుకోకపోవడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానం, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఋణాల మంజూరు, ఆర్థిక బకాయిల చెల్లింపు తదితర ఎన్నికల్లో ఇచ్చి హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. దసరాకు నాలుగు డీఏ బకాయిల్లో కనీసం ఒక్కటి సైతం ప్రకటించకుండా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను దగా చేసిందని ఆరోపించారు. వివిధ రూపాల్లో ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకు వెళ్లినప్పటికీ తాత్సారం చేయడంతో ఉపాధ్యాయలోకం ఆగ్రహంతో ఉందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయం మేరకు ఈనెల 7న తలపెట్టిన 'చలో విజయవాడ'లో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమాన్ని ప్రభుత్వం మరచిపోయిందని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించకుండా మరింత భారాన్ని మోపి మానసిక ఆందోళనకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలను చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. సమావేశంలో సీనియర్ నాయకులు పి.ప్రసాద్, పి.దిబ్బయ్య, పి.సుందర్‌రావు, మేడా శ్రీనివాస రావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు ఈనెల 7న విజయవాడలోని ధర్నా చౌక్‌లో తలపెట్టిన మహాధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ కె.నరసింహారావు ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడంతోపాటు, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, పాత పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలను కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, సెలవుల డబ్బులు, అంత్యక్రియల ఖర్చు తదితర సౌలభ్యాలను చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు ఏటా రూ. 180 కోట్లు హెల్త్ కార్డుల కోసం చెల్లిస్తున్నప్పటికీ ఏ హాస్పిటల్లోనూ వాటిని అంగీకరించడం లేదని తెలిపారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం చేపట్టాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్ : సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా సెలూన్, స్పా తదితర వాణిజ్య కార్యకలాపాల కేంద్రాల్లో సోమవారం పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరం నుంచి ఆదివారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7,8 తేదీల్లో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు తదితర అన్ని విద్యాసంస్థల్లో ప్రచారం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, వకృత్వ తదితర పోటీలను నిర్వహించాలని సూచించారు. జీఎస్టీ తగ్గింపుతో మెరుగైన గ్రామీణ కనెక్టివిటీ, సురక్షితమైన రవాణా ఎంపికలు, విద్యాసామగ్రిపై పన్ను ఉపశమనం, స్టార్టప్‌లకు మద్దతు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని జేసీ ఆదేశించారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.గీతామాధురి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక పాల్గొన్నారు.

కారు ఢీకొని వాహనచోదకుడి మృతి

చీరాల అర్బన్: వాడరేవులోని కొత్త బైపాస్ రోడ్డులో ఆదివారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు... వాడరేవుకు చెందిన లక్ష్మారెడ్డి (50) ఆదివారం తెల్లవారు జామున ద్విచక్రవాహనంపై చీరాల వస్తున్నాడు. కొత్త బైపాస్ రోడ్డులో గుంటూరు జిల్లా యడ్లపాడుకు చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో చీరాల నుంచి వాడరేవు వెళుతున్నారు. వేగంగా వచ్చిన కారు... ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో లక్ష్మారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మద్యానికి డబ్బులు లేవన్నందుకు దాడి

వ్యక్తికి గాయాలు

సత్తెనపల్లి: మద్యానికి డబ్బులు లేవన్నందుకు బావ తలను బావమరిది పగలగొట్టిన సంఘటన పట్టణంలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ సమీపంలో గల వైన్ షాప్ వద్ద ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న పెదాల నరసింహారావు మద్యం తాగేందుకు రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ సమీపంలో గల వైన్ షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ మద్యం తాగుతుండగా.. కొద్దిసేపటికి వరుసకు బావమరిది అయ్యే చెరుకూరి మణి వచ్చి మద్యం ఇప్పించమని అడిగాడు. తన వద్ద క్వార్టర్‌కే నగదు ఉన్నాయని, అయినా తాగే ఉన్నావుగా.. ఇంకెందుకంటూ దూషించి, మందలించాడు. మద్యం ఇప్పించకపోగా తననే దూషిస్తావా అంటూ మణి మద్యం సీసా తీసుకొని నరసింహారావు తలపై కొట్టాడు. దీంతో నరసింహారావు తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించుకుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పట్టణ ఎస్ఐ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ద్వితీయ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ నాయకులు

నెహ్రూనగర్: బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభ ఈనెల 19న గుంటూరులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు జి.శివపూర్ణయ్య తెలిపారు. ఆదివారం గుంటూరు తాలుకా పెన్షనర్స్ హోంలో మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఎంప్లాయిస్ సమస్యలు, ఉద్యోగులకు రిజర్వేషన్లు, ప్రమోషన్స్‌లో మెరిట్ కమ్ రోస్టర్ విధానం అమలుచేయడానికి తీసుకోవాల్సిన చర్యలు మీద చర్చించినట్లు తెలిపారు. ద్వితీయ మహాసభలో ప్రవేశపెట్టే తీర్మానాలు, సమావేశం విజయవంతం చేయడానికి అన్ని జిల్లాలలోని బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం వి. ప్రసాద్, గౌరవాధ్యక్షులు పి.వి.రమణయ్య, గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు రోషన్ ఎంపిక



:రోషన్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న 41 జాతీయ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియానికి చెందిన ఎస్‌కే రోషన్ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటాడని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రోషన్ 110 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్లో బంగారు పతకాలు సాధించి ఉత్తమ క్రీడాకారుడు అవార్డును కూడా గెలుపొందాడని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోషన్‌ను ఏపీ రేరా సభ్యులు దామచర్ల శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారని తెలిపారు. రోషన్‌కి సహాయ, సహకారాలను అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ప్రసాద్ తెలియజేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఉత్తమ సేవలు

డీఆర్ఎం సుథేష్ట సేన్



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్ఎం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): వికసిత్ భారత్- 2047 భాగంగా సమష్టి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, భారత ప్రభుత్వ వివిధ ప్రధాన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయాణికులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్ఎం సుథేష్ట సేన్ తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా వికసిత్ భారత్- 2047 కార్యక్రమంలో ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సామాజిక, ఆర్థికవృద్ధిని సాధించడంలో భారతీయ రైల్వేల పాత్ర గురించి తెలిపారు. పరిశుభ్రత, భద్రత, సమర్థ సేవలను అందించడంలో ప్రజల భాగస్వామ్యం, ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రయాణికులకుసంతృప్తిని అందించడంతోపాటు జాతీయ అభివృద్ధికి దోహదపడటం కోసం రైల్వే సిబ్బంది అంకితభావంతో పని చేయాలని ఆమె సూచించారు. అనంతరం ప్రయాణికులతో సంభాషించి వారి సూచనలు, సలహాలను తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.